క్లుప్తంగా

విజయవాడ తరలిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ



విజయవాడ తరలివెళ్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నాయకులు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జేఏసీ సమావేశానికి చీమకుర్తి నుంచి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ నాయకులు తరలివెళ్లారు. కమిటీ మండల నాయకుడు బండ్ల డేవిడ్ ఆధ్వర్యంలో పిల్లి కోటేశ్వరరావు, చావాబత్తిన బ్రహ్మయ్య, పారాబత్తిన గురవయ్య, వేమా బాలకోటేశ్వరరావు, మట్టిగుంట రామాంజులు, పలువురు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తరలివెళ్లారు.

బాలికకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న కేశవ

కొత్తపట్నం: నిరుపేద కుటుంబానికి చెంది కళ్లు కనిపించని బాలికకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామం ఆర్ఆర్‌కాలనీలో నివాసం ఉంటున్న కోటం నాగమల్లేశ్వరికి ఐకానిక్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత మిట్నసల అశోక్‌బాబు సహకారంతో మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు నగదు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టీమ్ ఆర్గనైజర్ డి.కేశవ, ఎం.సునీల్, డి.రజిత, ఎం.ప్రసాదు. ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులకు వివరిస్తున్న ఉపగ్రంథపాలకురాలు కోటేశ్వరి

ఒంగోలు సెంట్రల్: పుస్తక పఠనంతో విద్యార్థులకు విజ్ఞానం మరింత మెరుగుపడుతుందని ఉపగ్రంథపాలకురాలు కోటేశ్వరి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనం వలన జ్ఞాపకశక్తి పెరుగుతుందని, పఠనాసక్తి పెరుగుతుందని చెప్పారు. ఎస్ వ్యక్తిత్వ నిపుణుడు షిర్డి సాయిరాం వ్యక్తిత్వ వికాసం, గణితంలో సులభ పద్ధతుల గురించి తెలిపారు. ఉపాధ్యాయుడు, కవి జూలాది మోటివేషన్ కథలు చదివించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. పిల్లలతో పొడుపు కథలు చెప్పించి జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. గ్రంథాలయ సిబ్బంది శివకుమారి, అనిల్, ఇస్మాయేలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన యువకుడు

చీమకుర్తి: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన సంతనూతలపాడులో ఆదివారం చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన కాలండి రౌత్ సంతనూతలపాడు సమీపంలోని రెడీమేడ్ గార్మెంట్స్ యూనిట్ వద్దకు బైకుపై వెళ్తుండగా, ఒంగోలు నుంచి చీమకుర్తి వైపు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాలండి రౌత్ ఎడమ కాలి మోకాలి కీలు తొలగి తీవ్ర రక్తస్రావం జరిగింది. ఫోన్ బాగు చేయించుకుని వస్తానని సంతనూతలపాడు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. బాధితుడిని ఒంగోలు ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి చేర్చినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై దేవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

ఒంగోలు టౌన్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పాలిటెక్నిక్ కాలేజీ వద్ద హైవే సమీపంలోని ఇళ్లలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. మూడు ఇళ్లకు తాళాలు వేసి ఉండగా, దొంగలు చోరీకి యత్నించారు. ఒక ఇంట్లో ఏమీ దొరకలేదు. మరో ఇంట్లో మాత్రం 3 సవర్ల బంగారం ఎత్తుకెళ్లారు. ఇంకో ఇంట్లో 8 సవర్ల బంగారు నగలు దోచుకెళ్లారు. ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



వైద్యులకు రక్షణ కల్పించాలి

ఆస్పత్రుల్లో రోగులకు సేవలందిస్తున్న వైద్యులకు, వైద్యారోగ్య శాఖ సిబ్బందికి రక్షణ కల్పించాలి. లేదంటే విధులను ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించడం కష్టం. రోజూ రాత్రివేళ పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. విపత్తుల సమయంలో సత్వర సాయం అందేలా ప్రత్యేక రక్షణ కల్పించాలి. వైద్యశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించాలి.

– డాక్టర్ ఎస్పీ బాలయ్య, కొనకనమిట్ల పీహెచ్‌సీ



వైద్యులకు భద్రత కల్పించాలి

వైద్యులకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్యుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, హత్యాచారాలకు పాల్పడటం సరైన పద్ధతి కాదు. వైద్యం కోసం వచ్చే రోగుల బంధువుల మానసిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంటోంది. వైద్యుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి పాల్పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించే వైద్యులకు ప్రతిఒక్కరూ రక్షణగా నిలబడాలి.

– కడప రమణారెడ్డి, ప్రభుత్వ వైద్యుడు



ఈ భవనాలకు బాధ్యులెవరు..?

- రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వ భవనాల నిర్మాణం
- ఖాళీగా వదిలేయడంతో ఏళ్ల తరబడి నిరుపయోగం
- కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు సైతం పట్టించుకోని వైనం
- తీవ్ర నిర్లక్ష్యంతో వృథా అవుతున్న ప్రజాధనం



శిథిలావస్థలో ఉన్న ఒకప్పటి స్టెప్ కార్యాలయ భవనం



శ్లాబు నిర్మాణంతో వదిలేసిన స్టెప్ కార్యాలయ యువ భవనం

ఒంగోలు: పాలకులు, కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని భవనాలను పూర్తిగా నిర్మించకపోవడంతో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉండిపోయి చివరకు నిరుపయోగంగానే శిథిలమవుతున్నాయి. కాంట్రాక్టర్లకు లాభాలు, అధికారులకు కమీషన్లకు మినహా ప్రజలకు, ప్రభుత్వానికి వీటివలన ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో ఇలాంటి పలు భవనాలు అధికారులు, పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నాయి.

స్థానిక శర్మ కాలేజీ ఎదురుగా ఉన్న భవనం జిల్లా యువజన సంక్షేమ శాఖ శిక్షణ కార్యాలయంగా ఉండేది. ఈ భవనం ప్రస్తుతం ఎందుకూ పనికిరాకుండా పోయింది. చిల్లచెట్లు పెరిగి కిటికీలు ధ్వంసమై శిథిలావస్థకు చేరింది. దీనిని మరో ప్రభుత్వ శాఖకు అప్పగించారని అధికారులు చెబుతున్నా.. ఏ శాఖకు కేటాయించారో.. ఎందుకు ఇలా వదిలేశారనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఇదే యువజన సంక్షేమ శాఖకు శాశ్వత కార్యాలయంగా యువ భవన్ అంటూ స్థానిక హౌసింగ్ కార్యాలయం ఎదురుగా మరో పెద్ద భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. దాదాపు 8 సంవత్సరాల క్రితం దీనికి శంకుస్థాపన చేశారు. రూ.5 కోట్ల బడ్జెట్ అంచనాలతో ప్రారంభమైన ఈ భవన నిర్మాణాన్ని రెండు కోట్ల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన అనంతరం అసంపూర్తిగా వదిలివేశారు. కేవలం శ్లాబు నిర్మాణం అనంతరం భవనం పనులు ఆగిపోయాయి. అదేవిధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు చిన్నమొత్తాల పొదుపు ప్రోత్సాహక నగదుతో ఒక భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. దీనికి కూడా శ్లాబు వేసి వదిలేశారు. చిన్నమొత్తాల పొదుపు కార్యాలయం అవసరం లేకుండా చేయడం ద్వారా ఈ భవన నిర్మాణం ఆగిపోయింది. దానిని పూర్తిచేసి మరో శాఖకు కేటాయించే ఆలోచనే చేయకపోవడం తీవ్రస్థాయిలో విమర్శలకు తావిస్తోంది. ఈ భవనం పక్కన పెద్ద ఎత్తున చిల్లచెట్లు పెరిగి చివరకు పునాదులు కూడా ధ్వంసమయ్యేలా ఉన్నాయి. ఇదే ఆవరణలో ఒంగోలు మండల వ్యవసాయశాఖ అధికారి కార్యాలయాన్ని ఆనుకుని మండల వ్యవసాయశాఖ కార్యాలయ భవనం ఉండేది. అది కూడా నేడు నిరుపయోగంగా మారిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఒకవైపు ఉన్న భవనాలను నిరుపయోగంగా వదిలేసి.. మరోవైపు కొత్త భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు, నిధుల కేటాయింపులంటూ పాలకులు, అధికారులు మాట్లాడుతుండటంపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాధనాన్ని ఇంత భారీగా వృథా చేయడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనేక ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇరుకు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. ఉదాహరణకు ప్రభుత్వ పరీక్షల సహాయక అధికారి కార్యాలయం డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉంది. దీనికోసం ఒక భవనాన్నే పూర్తిగా వినియోగిస్తున్నారు. ఉన్నత పాఠశాలను విశాలంగా నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఇక, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం కూడా ప్రకాశం భవనంలో ఇరుకు గదుల్లో ఉంది. కోట్లు ఖర్చుచేసి నిర్మించిన భవనాలను ఇలాంటి కార్యాలయాలకు కేటాయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ, అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను బాగుచేయించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.





చిన్నమొత్తాల పొదుపు కార్యాలయం కోసం నిర్మించి నిరుపయోగంగా వదిలేసిన భవనం





ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో శిథిలావస్థకు చేరిన ఎరువుల గోడౌన్

లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాడదాం



మాట్లాడుతున్న జనసాహితి అధ్యక్షుడు దివికుమార్

ఒంగోలు సెంట్రల్: మతోన్మాదం, లైంగిక దాడులకు వ్యతిరేకంగా ప్రజా సంస్కృతి కోసం పోరాటం సాగించాలని జనసాహితి జిల్లా అధ్యక్షుడు దివికుమార్ అన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం జనసాహితి జిల్లా మహాసభ నిర్వహించారు. జనసాహితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య అధ్యక్షత వహించగా, దివికుమార్ మాట్లాడుతూ దేశంలో లైంగిక దాడులకు, విష సంస్కృతికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి ప్రజలంతా కలిసి రావాలని కోరారు. రాజీపడి జీవించే ప్రవృత్తి నుంచి ఉన్నతమైన సమాజాన్ని సాధించేందుకు మానవీయ చైతన్యం ప్రదర్శించే స్థాయికి సమాజం ఎదగాలని కోరారు. బలమైన సాంస్కృతిక ఉద్యమం కోసం జనసాహితితో కలిసి నడవాలని కోరారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు టి.అరుణ మాట్లాడుతూ సాంస్కృతిక పతనానికి మహిళలు ప్రథమ బాధితులుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, డ్రగ్స్, అశ్లీల వీడియోలపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనసాహితి జిల్లా మహాసభలు ఇలాంటి డిమాండ్స్ సాధించడానికి తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.అరుణ, కోశాధికారి శాంతి కుమారి, జిల్లా కార్యదర్శి ప్రసన్న తదితరులు పాల్గొని తమ సందేశాన్ని అందించారు.

సురక్షిత నీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్

ఒంగోలు సెంట్రల్: స్థానిక మాతాశిశు వైద్యశాలలో తల్లీబిడ్డలకు, వారి సహాయకులకు సురక్షిత నీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఆర్ఐ గుత్తా వెంకటకృష్ణ తెలిపారు. సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఐ గుత్తా వెంకటకృష్ణ ఆర్థిక సహకారంతో అతని తల్లిదండ్రులు మోతిలాల్ నెహ్రూ, అండాలమ్మ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఎస్ఆర్ఐ గుత్తా వెంకటకృష్ణ, మండల మురళీకృష్ణ ప్రారంభించగా, ట్రస్ట్ గౌరవ సభ్యుడు మండవ సుబ్బారావు, వ్యవస్థాపకుడు మండల మురళీకృష్ణ, ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మహిళా హక్కుల కమిషన్ మాజీ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర సంధ్య, ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్‌బాషా, షహనాజ్ దంపతులు, డాక్టర్ రమేష్, ప్రియాంక, జోత్స్న, దివ్య, ఒంగోలు నగర పాలక సంస్థ మాజీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, వడ్డెంపూడి సుజాత, బొమ్మరిల్లు రాజ్యలక్ష్మి, ట్రస్ట్ గౌరవ సభ్యులు వెంకట్, శ్రీనివాసరావు, రవి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్



కంభంలో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కంభం ఎస్సై బి.నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బస్టాండులో ప్రయాణికులు, ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు కలగకుండా ఆటోలు నిలుపుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో అనుమానాస్పద వ్యక్తులు ఎక్కితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఉంచుకుని యూనిఫాం ధరించి ఆటోలు నడపాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...

బేస్తవారిపేట: వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జంక్షన్‌లో ఒంగోలు–నంద్యాల హైవేపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయవద్దని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే జరిమానా తప్పదని హెచ్చరించారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపుదల

మార్కాపురం: కరాటే విద్యతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, వీలైనంత వరకు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కిశోర్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ గ్రేడింగ్ టెస్టులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రౌన్ బెల్ట్ నుంచి బ్లాక్‌బెల్ట్‌కు ప్రమోటైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్‌కే జోయాసిద్దికి, ఎస్‌కే యాసిన్‌బాషా, ఎస్‌కే షాకీర్ బాషా, జేకేఎస్‌సీ భార్గవ్, ఎం.తేజ వర్ధన్, ఎస్.చరణ్‌కుమార్, జె.వెంకట హరి బ్లాక్‌బెల్టుకు ప్రమోటయ్యారు. కార్యక్రమంలో కరాటే చీఫ్ ఎగ్జామినర్ ఎం.శ్రీనివాసరెడ్డి, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మతల్లి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

దొనకొండ: మండలంలోని దేశిరెడ్డిపల్లి, ఇండ్లచెరువు గ్రామాల్లోని ప్రజలు పోలేరమ్మ తల్లికి ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. ఏటా శ్రావణ మాసంలో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. మా ఊరును చల్లగా చూడమ్మా, పాడి పంటలు సమృద్ధిగా పండాలి, పిల్లా పాపలు సంతోషంగా ఉండాలి, సంవృద్ధిగా వర్షాలు పడాలంటూ మొక్కుకుంటారు. స్త్రీలు తలంటి స్నానాలు చేసి అమ్మవారికి నైవేద్యాలు చేసి సమర్పించారు. యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు.

నేటి నుంచి పోలేరమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవాలు



కాట్రగుంట పెద్దమ్మతల్లి మూలవిరాట్

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠాచార్యులు పోతులూరి శివరమాచార్యస్వామి ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజలు, మంగళ, బుధవారాల్లో గ్రామోత్సవం, విగ్రహచ కళశ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కాట్రగుంట గ్రామంలో సోమ, మంగళ వారాల్లో పెద్దమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం హోమాలు, గ్రామోత్సవం, మంగళవారం కుంకుమ బండ్ల ఉత్సవం, బోనాల సమర్పణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



కంకి దశలో ఉన్న సజ్జ

పంట కోసం పాట్లు!



పంట పొలాల్లో కోతుల గుంపు, కాకులను బెదిరిస్తూ చప్పుడు చేస్తున్న రైతు

కొనకనమిట్ల: ఆరుగాలం శ్రమించి, కష్టపడి పండించిన పంటను కాపడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్న పందులు, కోతులను బెదరగొట్టేందుకు రైతులు చేయని ప్రయత్నమంటూ లేదు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పంట చేల వద్ద కాపలా ఉంటూ, రాత్రిళ్లు మంచెల వద్ద జాగారం ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

రోడ్డు ఆక్రమణతో రాకపోకలకు అవస్థలు



రోడ్డుకు అడ్డంగా వేసిన చిల్లకంప

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని భైరవకొండ వెళ్లే రోడ్డును ఆక్రమించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. సర్వే నంబర్లు 1007, 1009, 1149 నుంచి రాకపోకలు సాగించేందుకు పూర్వం నుంచి రోడ్డు విడగొట్టబడింది. చీమలేటిపల్లెకు చెందిన కొందరు రైతులు ప్రస్తుతం ఆక్రమించి చిల్లకంప వేశారు. ఇదే రోడ్డు మీదుగా బూరుగచెరువు, దొనకొండ ఆర్అండ్‌బీ రోడ్డుకు వెళ్లాల్సి ఉంది. ఈ రోడ్డు వెంట వెళ్తుంటే నానా బూతులు తిడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాగే సమస్య తలెత్తితే రెవెన్యూ అధికారులు రోడ్డును విడగొట్టి హద్దులు వేశారు. ప్రస్తుతం మళ్లీ సమస్య సృష్టించారని, రెవెన్యూ అధికారులకు సమస్యపై అర్జీ ఇచ్చినప్పటికీ కాలయాపన చేస్తున్నారుగానీ.. సమస్యను పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.